మాట్లాడుతున్న కలెక్టర్ పి.రంజిత్ బాషా

పదవుల పందేరం..!

● సహకార సంఘాలకు త్రిసభ్య కమిటీలు

● స్థానం దక్కించుకునేందుకు కూటమి నాయకుల ప్రయత్నాలు

ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు త్రి సభ్య కమిటీలను ఏర్పాటు చేయాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ఆ కమిటీల్లో స్థానం దక్కించుకునేందుకు కూటమి నాయకులు ప్రయత్నాలు సాగిస్తున్నారు...

ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కర్నూలు జిల్లాలో 43, నంద్యాల జిల్లాలో 56 ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలు (పిఎసిఎస్‌లు) ఉన్నాయి. ఆయా పాలకవర్గాలకు ఇప్పట్లో ఎన్నికలు నిర్వహించే పరిస్థితి కనిపించడం లేదు. ఆరు నెలలపాటు త్రిసభ్య కమిటీలతో ఆయా సొసైటీలను నడపాలని రాష్ట్ర ప్రభుత్వం యోచిస్తోంది. ఈ నేపథ్యంలో ప్రాథమిక సహకార సంఘాల కమిటీల్లో స్థానం దక్కించుకునేందుకు పలువురు కూటమి నేతలు ప్రయత్నిస్తున్నారు. తమనే సొసైటీ కమిటీ ఛైర్మన్‌గా నియమించాలంటూ ఒత్తిడి తెస్తున్నారు. టిడిపి, బిజెపి, జనసేన నేతలు ఎవరికి వారు తమ ప్రయత్నాలు గట్టిగా సాగిస్తున్నారు. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు చివరిగా 2013 ఫిబ్రవరిలో ఎన్నికలు జరిగాయి. 2018లో పదవీకాలం ముగియగా అప్పట్లో ఎన్నికలు నిర్వహించలేదు. ఆ తర్వాత 2019లో అధికారంలోకి వచ్చిన వైసిపి ప్రభుత్వం త్రిసభ్య కమిటీలను తెరపైకి తీసుకొచ్చింది. గతేడాది జులై నెలాఖరుతో వీరి పదవీకాలం ముగిసింది. ఆ వెనువెంటనే కూటమి ప్రభుత్వం తాత్కాలికంగా సహకార సంఘాలకు పర్సన్ ఇన్‌ఛార్జీలను నియమించింది. పాలకవర్గం గడువు ముగిసి ఏడేళ్లవుతున్నా అటు ప్రాథమిక సహకార సంఘాలకు, ఇటు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు రెగ్యులర్ పాలకవర్గాలు లేవు. పర్సన్ ఇన్‌ఛార్జీలతో పాలన నడుపుతున్నారు. ప్రస్తుతం సొసైటీల అధ్యక్ష, డైరెక్టర్ల స్థానాలకు గ్రామస్థాయి నుంచి పలువురు పోటీ పడుతున్నారు. ప్రస్తుతం టిడిపిలో ఆశావహులు పెరిగిపోయారు. దీనికితోడు బిజెపి, జనసేన నేతలు కూడా పదవులు ఆశిస్తున్నారు. తమకూ కొన్ని సంఘాలు కేటాయించాలని ఆ రెండు పార్టీల నుంచి డిమాండ్ వ్యక్తమవుతోంది. ఒక్కో సొసైటీకి ఒక ఛైర్మన్, ఇద్దరు డైరెక్టర్లను నియమించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కసరత్తు చేస్తోంది. ఉమ్మడి కర్నూలు జిల్లా సహకార కేంద్ర బ్యాంకుకు, డిసిఎంఎస్ సొసైటీలకు ఏడుగురు సభ్యులతో సెవెన్‌మెన్ కమిటీలను నియమించనున్నారు. డిసిసిబికి పెద్దఎత్తున పోటీ నెలకొంది. తమ అనుయాయులనే నియమించాలని ఉమ్మడి జిల్లా నుంచి పలువురు కూటమి నాయకులు ప్రయత్నిస్తున్నారు. డిసిఎంఎస్ పదవులకు కూడా చాలా మంది పోటీ పడుతున్నారు. పలు నియోజకవర్గాల్లో గత సార్వత్రిక ఎన్నికల్లో పనిచేసిన వారికి సహకార సొసైటీల ఛైర్మన్లు, డైరెక్టర్లను నియమించే ప్రక్రియ ఓ కొలిక్కి వచ్చింది. నియోజకవర్గ ఎమ్మెల్యేల నుంచి జిల్లా సహకార అధికారి కార్యాలయానికి, పార్టీ అధిష్టానానికి కొన్ని నియోజకవర్గాల నుంచి ప్రతిపాదనలు పంపారు. మరి కొన్ని నియోజకవర్గాల నుంచి నివేదికలు పంపే ప్రక్రియ కొనసాగుతోంది. ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘాలకు అధిక సంఖ్యలో కూటమి నాయకులు పోటీ పడుతుండడంతో ఎవరిని పరపతి సంఘాల పదవులు వరిస్తాయోనన్న ఉత్కంఠ నెలకొంది.

తాగునీటి ఎద్దడి నివారణకు

రూ.6.91 కోట్లతో ప్రణాళిక

- కలెక్టర్ పి.రంజిత్ బాషా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో వేసవి కాలంలో తాగు నీటి ఎద్దడి నివారణకు రూ.6.91 కోట్లతో ప్రణాళిక రూపొందించే ప్రభుత్వానికి నివేదిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ పి.రంజిత్‌బాషా అధికారులను ఆదేశించారు. మంగళవారం కలెక్టరేట్ సునయన ఆడిటోరియంలో డిస్ట్రిక్ట్ వాటర్ అండ్ శానిటేషన్ మిషన్ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో 191 హ్యాబిటేషన్‌లలో తాగునీటి సమస్యల పరిష్కారానికి రూ.6.91 కోట్లతో డ్రౌట్ కంటింజన్సీ ప్లాన్‌ను రూపొందించామన్నారు. నిధులు మంజూరు కోరుతూ ఈ ప్లాన్‌ను ప్రభుత్వానికి పంపుతామన్నారు. ఇవి కాక ఏవైనా చిన్న చిన్న తాగునీటి సమస్యలుంటే మండల, పంచాయతీ నిధులను వినియోగించుకోవాలని ఎంపిడిఒలకు సూచించారు. ఆలూరులో నీటి సమస్య వచ్చిందని, ఈ సారి ఇలాంటి సమస్యలు రాకుండా ముందుగానే ప్రణాళికా బద్ధంగా చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని 33 సమ్మర్ స్టోరేజ్ ట్యాంకులను పూర్తిగా నింపాలని అధికారులను ఆదేశించారు. 15 రోజులకు ఒకసారి నీటిని క్లోరినేషన్ చేయాలని, 15 రోజులకు ఒకసారి వాటర్ ట్యాంక్ క్లీన్‌లను చేసి ప్రజలకు స్వచ్ఛమైన తాగునీటిని అందించేందుకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ డిపిఒను ఆదేశించారు. హెచ్‌ఎన్‌ఎస్‌ఎస్ ద్వారా గాజులదిన్నె ప్రాజెక్టుకు సరఫరా చేస్తున్న 290 క్యూసెక్కుల నీరు నష్టం కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని ఇరిగేషన్ ఇంజనీర్లను ఆదేశించారు. హంద్రీనీవా నీటితో 68 చెరువులకు నీరందించడంలో భాగంగా జిల్లాలోని 39 చెరువులకు గాను ఇందులో 33 పూర్తిగా నింపారని, మిగతా 6 చెరువులను కూడా త్వరితగతిన నింపాలని కలెక్టర్ ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. ఆదోని సబ్ కలెక్టర్ మౌర్య భరద్వాజ్, కర్నూలు ఆర్‌డిఒ సందీప్ కుమార్, పత్తికొండ ఆర్‌డిఒ భరత్ కుమార్, ఆర్‌డబ్ల్యుఎస్ ఎస్ఈ నాగేశ్వరరావు, జిల్లా పరిషత్ సిఇఒ నాసరరెడ్డి, జలవనరుల శాఖ ఎస్ఇ బాలచంద్రారెడ్డి, మున్సిపల్ కార్పొరేషన్ ఎస్ఇ రాజశేఖర్, డిపిఒ భాస్కర్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇలు, డిఇలు, ఎఇఇలు, ఎంపిడిఒలు, ఇఒఆర్‌డిలు తదితరులు పాల్గొన్నారు.

రైతులకిచ్చిన హామీలను నెరవేర్చాలి

- జగజిత్‌సింగ్ దలేవాలా ప్రాణాలు కాపాడాలి

- కర్నూలు ఎంపీకి అఖిలపక్ష రైతుసంఘాల వినతి

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్

జగజిత్ సింగ్ దల్లేవాలా ప్రాణాలను కాపాడాలని, రైతులకు గిట్టుబాటు ధర చట్టం ప్రకారం పార్లమెంటులో చట్టం చేసి వ్యవసాయాన్ని కాపాడాలని కర్నూలు జిల్లా అఖిలపక్ష రైతు సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. మంగళవారం పంచలింగాల గ్రామంలో కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు స్వగృహంలో రైతు సంఘాల నాయకులు కలుసుకొని వినతిపత్రం సమర్పించారు. ఎపి రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి జి.రామకృష్ణ, ఎపి రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి శ్రీనివాసరావు, రైతు కూలీ సంఘం నాయకులు వెంకటేశ్వర్లు, రైతు స్వరాజ్య వేదిక నాయకులు పోతుల శేఖర్ మాట్లాడారు. 2021వ సంవత్సరంలో రైతు వ్యతిరేక చట్టాలకు వ్యతిరేకంగా 365 రోజులకు పైగా ఆందోళన చేసిన సందర్భంగా 750 మంది రైతులు చనిపోయారన్నారు. వారందరికీ నష్టపరిహారం ఇస్తానని చెప్పిన నరేంద్ర మోడీ ఇప్పటివరకు ఇవ్వలేదన్నారు. రైతాంగానికి సమగ్ర పంటల ఉత్పత్తి వ్యయం పైన 50 శాతం ఇస్తానని చెప్పి కేంద్ర ప్రభుత్వం మోసం చేసిందన్నారు. ఇప్పటికే అధిక పెట్టుబడుల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతుండగా పుండు మీద కారం చల్లిన మాదిరి మోటార్లకు మీటర్లు బిగిస్తామని అధిక భారం వేయడానికి ప్రభుత్వం ప్రయత్నిస్తుందని, జిఒ నెంబర్ 70 తీసుకువచ్చి అన్ని రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేయాలని చెప్పి ఒత్తిడి చేయడం క్షమ్యంతవ్యం కాదని వారు అభిప్రాయపడ్డారు. స్మార్ట్ మీటర్ల జిఒను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రైతాంగం న్యాయమైన సమస్యలపై రైతు నాయకుడు జగదీష్ సింగ్ దల్లేవాల 56 రోజులుగా ఆమరణ నిరాహార దీక్ష చేస్తున్నప్పటికీ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ స్పందించకపోవడం రైతు వ్యతిరేకత ప్రభుత్వంగా స్పష్టంగా అర్థం అవుతుందని తెలిపారు. రైతులకు గిట్టుబాటు ధర, రుణ విముక్తి చట్టం, మోటార్లకు మీటర్లు పెట్టే విధానం రద్దు చేయడం రైతులకు నష్టం కలిగించే వ్యవసాయ చట్టాలు పార్లమెంటులో వెనక్కు తీసుకోవాలని, రద్దు చేయాలని పోరాటం చేసిన సందర్భంగా చనిపోయిన వారందరికీ ఎక్స్‌గ్రేషియా చెల్లించాలని ఆందోళన చేస్తున్న రైతు నాయకుడు ప్రాణాలను కాపాడాలన్నారు. రైతు సంఘాలతో తక్షణమే చర్చలు జరపాలని, ఈ సమస్యలపై ఎంపిలు పార్లమెంటులో ప్రభుత్వాన్ని నిలదీయాలని విజ్ఞప్తి చేశారు. ఎంపీ నాగరాజు స్పందిస్తూ న్యాయమైన సమస్యలపై పార్లమెంటులో నినదిస్తానని రైతు నాయకులకు హామీ ఇచ్చారు. కర్నూలు మండలం రైతు సంఘం నాయకుడు ఆంజనేయులు, తాండ్రపాడు సర్పంచి, రైతు సంఘం నాయకులు బాలపీరా, సిఐటియు నాయకులు హుస్సేనయ్య, రైతు నాయకుడు శ్రీనివాస్ రెడ్డి, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గోపాల్, నరసింహ, బాష తదితరులు పాల్గొన్నారు.



వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

సృజనాత్మకత, శాస్త్రీయ దృక్పథాన్ని పెంచండి

-డిఇఒ శ్యామ్యూల్ పాల్

ప్రజాశక్తి- కర్నూల్ కలెక్టరేట్

విద్యార్థుల్లో సృజనాత్మకతను, శాస్త్రీయ దృక్పథాన్ని పెంపొందించాలని, బాలోత్సవాల్లో అటువంటి పోటీలే పెట్టి విద్యార్థుల నైపుణ్యాలను వెలికి తీయాలని జిల్లా విద్యాధికారి ఎస్. శ్యామ్యూల్ పాల్ అన్నారు. మంగళవారం తన కార్యాలయంలో బాలోత్సవ నిర్వాహకులతో కలసి నాల్గవ బాలోత్సవ పండుగ పోస్టర్‌ను ఆవిష్కరించారు. డిఇఒ మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను కోల్పోతున్నారని, దీనికి ప్రధానంగా మొబైల్ అడిక్షన్, సామాజిక మాధ్యమాలు కారణం అవుతుందన్నారు. చరవాణిని విద్యార్థుల విద్యా పురోభివృద్ధికి వినియోగించుకునేందుకు దోహదమయ్యే సలహాలు ఉపాధ్యాయులు ఇవ్వాలని, పిల్లల్ని పర్యవేక్షించాలన్నారు. సహజమైన మేధస్సు గల విద్యార్థులుగా తయారు చేయడంలో మన పాత్ర కీలకమన్నారు. ఇటీవల కాలంలో విద్యార్థుల్లో ఒత్తిడి సంఘర్షణల వల్ల సహజ సిద్ధమైన జ్ఞానానికి దూరమైతున్నారన్నారు. ఇటువంటి పరిస్థితులను అధిగమించాలంటే సంవత్సరానికోసారి బాలోత్సవాలు నిర్వహించాలని, ఉత్సవాల్లో నిర్వహించే సాంస్కృతిక కళాత్మక ప్రదర్శనల వల్ల విద్యార్థుల్లో సహజసిద్ధమైన మేధస్సు, జ్ఞానం అభివృద్ధి చెందుతుందన్నారు. సందేశాత్మకమైన పోటీలు నిర్వహించాలని, విద్యా శాఖ బాలోత్సవాలకు పూర్తిగా సహకరిస్తుందని అన్నారు. గ్రామీణ ప్రాంత విద్యార్థులను ఎక్కువ మందిని భాగస్వామ్యం చేయాలని ఈ సందర్భంగా నిర్వాహకులను కోరారు. నిర్వాహక సభ్యులు, కన్వీనర్ జెఎన్.శేషయ్య, ప్లానింగ్ కన్వీనర్ కెంగార మోహన్, నిర్వహణ సభ్యులు డి.ధనుంజయ, యు ఆర్ఎ రవికుమార్, ఎస్ఎం జయరాజు, మద్దిలేటి, జెల్లి రంగస్వామి, సాయి ఉదయ్, మద్దిలేటి తదితరులు పాల్గొన్నారు.



గోడపత్రికను ఆవిష్కరిస్తున్న నాయకులు

లెనిన్ ఆశయ సాధనకు కృషి

- సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

విశ్వ మానవాళి విముక్తి కోసం పోరాడి రష్యాలో మొట్టమొదటి దోపిడీ లేని కార్మిక రాజ్యాన్ని స్థాపించి మానవ సమాజానికి కొత్త మార్గాన్ని చూపించిన మహనీయుడు విఐ లెనిన్ అని, ఆయన ఆశయాలను కమ్యూనిస్టు కార్యకర్తలు అంకితమై పని చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి డి.గౌస్‌దేశాయ్ తెలిపారు. మంగళవారం కర్నూలు సుందరయ్య భవన్‌లో లెనిన్ 101వ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. మొదట లెనిన్ చిత్రపటానికి నాయకుల పూలమాలలు వేసి శ్రద్ధాంజలి ఘటించారు. సిపిఎం న్యూ సిటీ కార్యదర్శి టి. రాముడు అధ్యక్షతన జరిగిన కార్యక్రమాన్ని ఉద్దేశించి గౌస్‌దేశాయ్ మాట్లాడారు. ఆనాటి సోవియట్ యూనియన్‌లో ఉన్న జార్ చక్రవర్తికి వ్యతిరేకంగా కార్మిక రంగంలో అనేక పోరాటాలు నిర్వహించి విప్లవ మార్గాన్ని చేపట్టిన వ్యక్తి లెనిన్ అని ఆయన 60 సంవత్సరాల జీవితకాలంలో ఎక్కువ భాగం జైల్లో అజ్ఞాతంలో గడిపారని కొనియాడాడు. నాడు రష్యాలో వివిధ గ్రూపులుగా ఉన్న కమ్యూనిస్టు పార్టీలను ఏకం చేసి విప్లవబాటలను నడిపిన వ్యక్తి, కారల్ మార్క్స్ సిద్ధాంతాన్ని తొలిసారిగా ఆచరణలో పెట్టిన వ్యక్తి ఇది నిజమేనని తెలిపారు. అందుకోసం ప్రపంచవ్యాప్తంగా మార్క్సిజం, లెనినిజం అనే నానుడి వచ్చిందని తెలిపారు. నాడు రష్యాలో అనేక రకాల విచ్చిన శక్తులను అధిగమించి అక్కడున్న బోల్‌విక్ పార్టీని ఐక్యంగా ముందుకు నడిపి విప్లవ మార్గాన్ని చూపించిన వ్యక్తి అని తెలిపారు. ఆయన మార్గాన్ని ప్రతి కమ్యూనిస్టు కార్యకర్త అనుసరించాలన్నారు. సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్, సిపిఎం జిల్లా నాయకులు గురుశేఖర్, ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు రంగప్ప, అబ్దుల్లా, రాఘవేంద్ర, సిపిఎం నగర నాయకులు సాయిబాబా సుధాకర్ ప్రభాకర్, యేసు నాగరాజు,తదితరులు పాల్గొన్నారు.

లెనిన్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న నాయకులు

అబ్దుల్‌కలా పాఠశాల విద్యార్థిని అభినందిస్తున్న డిఇఒ శామ్యూల్‌పాల్

అబ్దుల్ కలాం పాఠశాల విద్యార్థికి అభినందన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జాతీయ స్థాయిలో నిర్వహించిన పరీక్ష పే చర్చ కార్యక్రమంలో రాష్ట్రం నుండి ఎంపికైన కర్నూలులోని డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం మున్సిపల్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఈపూరు సుహృతి నీడిఒ ఎస్ శామ్యూల్ పాల్ మంగళవారం అభినందించారు. విద్యార్థినికి గైడ్ టీచర్‌గా వెళ్లిన పాఠశాల ప్రధానోపాధ్యాయులు విజయలక్ష్మిని కూడా అభినందించారు. ఈ సందర్భంగా డిఇఒ మాట్లాడుతూ జాతీయ స్థాయిలో జిల్లా క్యాతిని చాటిన పాఠశాల విద్యార్థిని ఈపూరు సుహృతిని పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఉపాధ్యాయులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు.

బాలికలకు విద్యనందించాలి

కర్నూలు కలెక్టరేట్: బాలికలకు విద్యను తప్పనిసరిగా అందించాలని సిడిపిఒ అనురాధ అన్నారు. ఓర్వకల్లు ఎంపిడిఒ కార్యాలయంలో అంగన్వాడీ కార్యకర్తలకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. సిడిపిఓ మాట్లాడుతూ బాల్యవివాహాలను పూర్తిస్థాయిలో అరికట్టాలన్నారు.

డైరీని ఆవిష్కరిస్తున్న అధికారి జి.శ్రీనివాసం

ఎపి ఎన్‌జివిఎఫ్ డైరీ ఆవిష్కరణ

ప్రజాశక్తి కర్నూలు అగ్రికల్చర్

ఆంధ్రప్రదేశ్ నాన్ గ్రాడ్యుయేట్ వెటర్నరీయన్స్ ఫెడరేషన్ (ఎపి ఎన్‌జివిఎఫ్) నూతన డైరీని ఆవిష్కరించారు. అలాగే పశు సంవర్ధక సహాయకుల గోడ క్యాలెరర్‌ను ఉమ్మడి కర్నూలు జిల్లా ఫెడరేషన్ ఛైర్మన్ జి.వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జి.శ్రీనివాస్ చేతుల మీదుగా సోమవారం ఆయన కార్యాలయంలో ఆవిష్కరించారు. మూడు సంఘాలకు సంబంధించిన (వెటర్నరీ అసిస్టెంట్, లైవ్ స్టాక్ అసిస్టెంట్, జూనియర్, వెటర్నరీ లైవ్ స్టాక్ ఆఫీసర్స్ అసోసియేషన్) సంఘ నాయకులతోపాటు పశుసంవర్ధక సహాయకుల సంఘం జిల్లా అధ్యక్షులు పి.నాగ వాసవి, కార్యదర్శి సురేష్, రమాదేవి, విఎ జిల్లా అధ్యక్షులు ఎల్.స్రవంతి, సీనియర్ నాయకులు వై.జనార్ధన్ రెడ్డి, ఎస్.రంగన్న, కె.బాబురావు, పి.వరప్రసాద్, ఎమ్ఎమ్‌డి.యూసుఫ్, ఎంసి.గంగా అయేశ్వరి, రాజేష్, లక్ష్మీదేవి, రఫీ పాల్గొన్నారు.

ఎపి ఇఆర్‌సి ఛైర్మన్‌కు పిపిఎస్‌ఎస్ వినతి

ప్రజాశక్తి- కర్నూలు కార్పొరేషన్

పాత మీటర్ల స్థానంలో కొత్త విద్యుత్ స్మార్ట్ మీటర్ల విధానంపై సవరణ డ్రాఫ్టుపై అభ్యంతరాలు తెలియజేస్తూ కార్బైడ్ ఫ్యాక్టరీ సమీపంలోని ఎపిఇఆర్‌సి భవన్‌లో ఛైర్మన్ ఠాకూర్ రామ్‌సింగ్, ఫైనాన్స్ మెంబర్ పివిఆర్‌రెడ్డిలకు పట్టణ పౌరసంక్షేమ సంఘం ప్రతినిధి బృందం మంగళవారం వినతి పత్రం ఇచ్చారు. ఈనెల1న కమిషన్ జారీ చేసిన పబ్లిక్ నోటీస్ ప్రకారం అభ్యంతరాలు తెలిపామన్నారు. ఈ ప్రతినిధి బృందంలో పట్టణ పౌర సంక్షేమ సంఘం నాయకులు ఇరిగినేని పుల్లారెడ్డి, సివివర్మ, ఎండి.యూనుస్, బి. వన్నూరు సాహెబ్, జి. శివ ప్రసాద్ చౌదరి, నాసిర్ అహ్మద్ ఖాన్ ఉన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రస్తుతం ఉన్న విద్యుత్ మీటర్లను తొలగించి.. కొత్త స్మార్ట్ మీటర్ల ఏర్పాటు చేయడం వాటి ద్వారా విద్యుత్ బిల్లుల చెల్లింపులు,సెక్యూరిటీ డిపాజిట్లు తదితర విధానాలను ఉపసంహరించుకోవాలని కోరారు. ఇప్పటికే విద్యుత్ పంపిణీ కోసం ప్రభుత్వం అనుమతి పొందిన మూడు సంస్థలు ఎపిఎస్‌పి, ఎస్‌సిఎల్, ఎపిసిపిడిసిఎల్, ఎపిఇపిడిసిఎల్ ఉండగా మరో ప్రైవేటు సంస్థకు లైసెన్సులు ఇస్తున్నట్లు తెలిసిందన్నారు. దీనివల్ల విద్యుత్ రంగాన్నే ప్రైవేటీకరించే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. ఎపిఇఆర్‌సి ఛైర్మన్ ఠాకూర్ రామ్ సింగ్ మాట్లాడుతూ విద్యుత్ పంపిణీ కోసం మరో కొత్త ప్రైవేటు సంస్థకు లైసెన్సు ఇవ్వడం లేదని తెలిపారు. స్మార్ట్ మీటర్ల ద్వారా విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరించే ఆలోచన కూడా లేదని హామీ ఇచ్చారు. ఎపిఇఆర్‌సి సెక్రెటరీ మాట్లాడుతూ మీరిచ్చిన అభ్యంతరాలన్ని రికార్డ్ చేస్తామని తెలిపారు.

వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

23న ట్రాన్స్‌పోర్ట్ రంగ సమావేశం

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ట్రాన్స్‌పోర్ట్ రంగ జిల్లా నాయకులు, కర్నూలు నగర న్యూ సిటీ ఓల్డ్ సిటీ అధ్యక్ష కార్యదర్శులు నాయకులు మండల, ముఖ్య నాయకుల సమావేశం కార్మిక కర్షక భవన్ సిఐటియు కర్నూల్ జిల్లా కార్యాలయంలో గురువారం కార్మిక, కర్షకభవన్‌లో ఉంటుందని, ఎపి ఆటో అండ్‌ట్రాలీ డ్రైవర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి కె.ప్రభాకర్ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సమావేశంలో రవాణా రంగంపై పడుతున్న బారాలపై చర్చించాలన్నారు. సిఐటియు జిల్లా అధ్యక్షులు పిఎస్ రాధాకృష్ణ, జిల్లా కార్యదర్శి ఎండి. అంజిబాబు హాజరవుతారనినపేర్కొన్నారు.

సమావేశం యొక్క ప్రాముఖ్యతను గుర్తించి ఆటో,లారీ, స్కూల్ బస్ డ్రైవర్స్, లైట్ మోటార్ వెహికల్స్ డ్రైవర్స్ ఆర్టీసీ హెయిర్ విత్ డ్రైవర్స్ యూనియన్ నాయకులు తప్పనిసరిగా హాజరు కావాలన్నారు. సభ్యత్వనమోదు, జిల్లా జాత, మార్చి 24న చలో ఢిల్లీ , సదస్సులు,తదితరాలుంటాయన్నారు.

మహిళల్లో అక్షర వెలుగులు

ప్రజాశక్తి - కోడుమూరు రూరల్

మహిళల్లో అక్షర కాంతులు నింపేందుకు కేంద్రం ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందని ఎపిఎం సుబ్బయ్య అన్నారు. .మంగళవారం కోడుమూరు మండలంలోని మండల చైతన్య మండల మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో ఉల్లాస్ శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. మహిళల్లో అక్షర కాంతులు నింపేందుకు కేంద్రం ఉల్లాస్ కార్యక్రమాన్ని అమలు చేస్తుందన్నారు. ఈ సందర్భంగా ఎపిఎం సుబ్బయ్య విద్యపై వాలంటీర్లకు అవగాహన కల్పించారు. మండల సమాఖ్య అధ్యక్షురాలు మల్లేశ్వరి ,ఎపిఒ ప్రతాప్, ఏ పి ఎం సుబ్బయ్య, సిసిలు పాల్గొన్నారు.

23న హోసూరులో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి-పత్తికొండ : ఈనెల 23న పత్తికొండ మండలం హోసూరు గ్రామంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నట్లు టిడిపి నాయకుడు సాయినాథ్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం మీడియాతో టిడిపి నాయకుడు సాయినాథ్ రెడ్డి మాట్లాడుతూ కీర్తిశేషులు కొత్తకాపు భీమేశ్వర్ రెడ్డి 13వ వర్ధంతిన కర్నూల్ శ్రీ చక్ర హాస్పిటల్ ఆధ్వర్యంలో హోసూర్ గ్రామపంచాయతీ దగ్గర ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్నామని అన్నారు. 2డి, ఇసిజి, కంటి పరీక్ష, షుగరు, బిపి ,జనరల్ చెకప్ మరిన్ని వైద్య సేవలు ఉంటాయని అన్నారు.

లెనిన్‌కు నివాళి అర్పిస్తున్న ఎం.రాజశేఖర్, షరీఫ్, ఇక్బాల్ తదితరులు

గొప్ప మార్గాన్వేషి లెనిన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

క్లిష్ట సమయంలో సరైన మార్గాన్ని చూపిన గొప్ప మార్గాన్వేషి లెనిన్ అని సిపిఎం ఓల్డ్ సిటీ కార్యదర్శి ఎం. రాజశేఖర్ కొనియాడారు. ప్రపంచ కార్మిక వర్గ శ్వాస లెనిన్ అభివర్ణించారు. మంగళవారం లెనిన్ శత వర్ధంతి ముగింపు సభ సందర్భంగా స్థానిక గడియారం హాస్పిటల్ ఎదురుగా ఉన్న హరికిషన్ సింగ్ సుర్జీత్ భవన్‌లో డి. అబ్దుల్ దేశాయ్ అధ్యక్షతన నిర్వహించారు. ఎం. రాజశేఖర్ ,నగర కార్యదర్శి వర్గ సభ్యులు, ఎస్ఎండి. షరీఫ్‌మాట్లాడారు. లెనిన్ జీవిత విశేషాలు సాధించిన విజయాలను వివరించారు. ఇక్బాల్ హుస్సేన్, ఇంతియాజ్, సలీంబాష, ఇలియాజ్, అక్బర్‌బాష, ఈశ్వర్,మూస మియ్య పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతు అధ్వానం

-రూ.2. 20 కోట్ల నిధులు మంజూరు

-సంక్రాంతికి పూర్తికాని రోడ్డు మరమ్మతులు

-అస్తవ్యస్తం..అసంపూర్తి...

ప్రజాశక్తి-పత్తికొండ

వాహనదారులకు రోడ్ల గుంతలు లేకుండా సౌకర్యవంతంగా ఉండాలని రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా రోడ్ల మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేసింది. జనవరి 15 సంక్రాంతి నాటికి రాష్ట్రవ్యాప్తంగా రోడ్లు గుంతలు ఉండకూడదని ముఖ్యమంత్రి నారాచంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. తూతూ మంత్రంగా రోడ్లను మరమ్మతులు చేసి ఆర్‌అండ్‌బి అధికారులు, కాంట్రాక్టర్లు మమ అనిపించిన సంఘటనలు పత్తికొండ డివిజన్‌లో చోటుచేసుకుంది. పత్తికొండ, మద్దికేర, తుగ్గలి, దేవనకొండ, ఆస్పరి మండలాల పరిధిలోని 142 కిలో మీటర్ల మేరకు రోడ్డు మరమ్మతుల కోసం రూ.రెండుకోట్ల 20 లక్షలు నిధులు మంజూరయ్యాయి. పత్తికొండ మండలం పత్తికొండ నుండి బురుజుల , బైపాస్ రోడ్డు, పత్తికొండ నుండి విరుపాపురం వరకు, మద్దికేర మండలంలో మద్దికేర నుండి పెరవలి మీదుగా తుగ్గలి వరకు, తుగ్గలి మండలంలో ఎర్రగుడి నుండి పత్తికొండ వరకు, దేవనకొండ మండలం కరివేముల నుండి హరేకల్, ఆస్పరి మండలం బిల్లేకల్ నుండి చిన్న హోతూరు ప్రధాన రోడ్డు మార్గాల మీద మరమ్మతుల చేయాలని ఆదేశాలు ఉన్నాయి. ఇష్టానుసారంగా కాంట్రాక్టర్ రోడ్డు మరమ్మతులో నాణ్యత ప్రమాణాలు పాటించకుండా తూతూ మంత్రంగా వేసి రోడ్లు వారం గడవకముందే తారు లేచిపోవడంతో గుంతలు గుంతలు ఏర్పడి రోడ్డు అద్వానంగా మారుతుందని వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పర్యవేక్షించాల్సిన ఆర్‌అండ్‌బి అధికారులు కార్యాలయాలకు పరిమితం అవుతున్నారని ప్రజలు విమర్శిస్తున్నారు.

నాణ్యత ప్రమాణాలతో రోడ్డు మరమ్మతులు

ఉప కార్య నిర్వహాక ఇంజనీర్,శివ రుద్ర కుమార్

ప్రధాన రోడ్డు మార్గంపై డ్రైనేజీ నీళ్లు రావడంతోనే రోడ్డు అస్తవ్యస్తం అవుతుంది. ప్రధాన రోడ్డు మార్గం ఆనుకొని గ్రామీణ ప్రాంతాలు ప్రజలు రోడ్లపై డ్రైనేజ్ నీళ్లు వదులుతున్నారు. పత్తికొండ ఆర్‌డిఒ భరత్‌నాయక్ దృష్టికి తీసుకెళ్లాం. ఎప్పటికప్పుడు రోడ్డు మరమ్మతులు చేయిస్తున్నాం.

ఇటీవల కొత్తగా మరమ్మతు చేసిన ఆర్‌అండ్ రోడ్డు

పూర్తిస్థాయిలో మరమ్మత్తుల పనులు చేయాలి

సిపిఎం మండల కార్యదర్శి వెంకటేశ్వర్ రెడ్డి

నాణ్యత ప్రమాణాలతో గుంతలు పూడ్చి వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా రోడ్డు మరమ్మతులు చేయాలి. తూతూ మంత్రంగా రోడ్లు మరమ్మతులు చేస్తే ప్రజలను కలుపుకొని ఆందోళన చేపడతాం.

చేనేతలకు నూతన పరిజ్ఞానం పెంపొందిస్తాం

- జిల్లా చేనేత అధికారి నాగరాజు

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

చేనేతలకు నూతన పరిజ్ఞానం పెంపొందిస్తామని జిల్లా చేనేత అధికారి నాగరాజు పేర్కొన్నారు. మంగళవారం పట్టణంలోని కుర్ని కళ్యాణ మండపంలో ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయ నాగేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు జిల్లా చేనేత జౌళి శాఖ అధికారి నాగరాజు ఆధ్వర్యంలో చేనేత కార్మికుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. హ్యాండ్‌లూమ్ ఎక్స్‌పోర్ట్ కౌన్సిల్ చెన్నై ఎమ్మిగనూరు ప్రాంతాన్ని చేనేత వస్త్రాల ఉత్పత్తి సామర్థ్యం ఉన్న ప్రాంతంగా గుర్తించిందని తెలిపారు. ఇంపోర్ట్, ఎక్స్‌పోర్ట్ కోడ్‌ను తీసుకునేందుకు చేనేత కార్మికులు, మాస్టర్ వీవర్స్ 25 మంది ముందుకొచ్చారని చెప్పారు. ఈనెల 23న ఉదయం 10 గంటలకు ఆటోనగర్, వెహెచ్‌సి కార్పొరేట్ కాంపౌండ్, మంగళగిరిలో ఈ 25 మంది చేనేత కార్మికులకు ట్రైనింగ్ ఉంటుందని తెలిపారు.

శిక్షణ అందిస్తున్న జిల్లా చేనేత అధికారి నాగరాజు

పారిశ్రామిక వేత్తలుగా రాణించాలి

- జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్ కుమార్

ప్రజాశక్తి - ఆదోని

ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాలతో పారిశ్రామిక వేత్తలుగా ఎదగాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఆనంద్ రాజ్ కుమార్ తెలిపారు. ఆదోనిలోని నాక్ ఆధ్వర్యంలో ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వ్యాపార నిర్వహణ శక్తి సామర్థ్యాలు, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలు ఎదగడానికి మెళకువలు, వ్యాపార చేసుకోవడానికి కావాల్సిన విధి విధానాలు అంశంపై నిపుణులు వివరించారు. వ్యాపార అభివృద్ధిలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు అంశాలపై ఈడీపీ శిక్షకులు రామాంజనేయులు, రాజశేఖర్ అవగాహన కల్పించారు. ఈనెల 23 వరకు శిక్షణ తరగతులు ఉంటాయని, రోజు ఓ అంశంపై అవగాహన కల్పిస్తామని తెలిపారు. నాక్ సెంటర్ ఇన్‌ఛార్జీ బి.జి.ఉల్లిగన్న, నిరుద్యోగ యువత, నాక్ సిబ్బంది పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న అధికారులు

'నగరదోన'ను పూర్తి చేసి రైతులకు అంకితమివ్వాలి

- కాంగ్రెస్ ఇన్‌ఛార్జి లక్ష్మీనారాయణ

ప్రజాశక్తి - చిప్పగిరి

నగరదోన రిజర్వాయర్ పనులను పూర్తి చేసి రైతులకు అంకితం ఇవ్వాలని కాంగ్రెస్ ఆలూరు ఇన్‌ఛార్జి చిప్పగిరి లక్ష్మీనారాయణ కోరారు. మంగళవారం అనంతపురం జిల్లాలోని నీటిపారుదల శాఖ జిల్లా సూపరింటెండెంటింగ్ ఇంజినీర్ రాజశేఖర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. నగరదోన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులు ప్రారంభించి, వలసలు నివారించాలని కోరారు. చిప్పగిరి మండలంలోని నగరదోన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పూర్తయితే 4,500 ఎకరాలకు సాగునీరు అందుతుందని తెలిపారు. మండలంలోని నగరదోన, రామదుర్గం, సంఘాల, నేమకల్లు, ఆలూరు మండలంలోని హత్తిబెళగల్, హాలహర్వి మండలం అర్ధగేరి, మేదేహాల్, మాచనూరు గ్రామాల రైతులకు 4,500 ఎకరాలు ఆయకట్టులోకి వస్తుందని చెప్పారు. రైతులకు మేలు జరగడమే కాకుండా వలసలను నివారించవచ్చని తెలిపారు. ఈ విషయాన్ని రాష్ట్ర ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి, పూర్తి చేసి రైతుల కష్టాలను తీర్చాలని కోరారు. కాంగ్రెస్ నాయకులు గాలి మల్లికార్జున, మహేంద్ర, కరెంటు గోవిందు, వీరాంజనేయులు పాల్గొన్నారు.


వినతి పత్రం అందజేస్తున్న లక్ష్మీనారాయణ, నాయకులు

అధికారుల నిర్లక్ష్యం.. రోడ్లు గుంతలమయం

- ప్రమాదాల బారిన వాహనదారులు - పట్టించుకోని అధికారులు, ప్రజాప్రతినిధులు

ప్రజాశక్తి - హాలహర్వి

అధికారుల అలసత్వం.. పాలకుల నిర్లక్ష్యం వల్ల గ్రామీణ ప్రాంతాల్లోని రోడ్లన్నీ గుంతలమయమయ్యాయి. వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు.

హాలహర్వి మండలంలో 15 పంచాయతీలున్నాయి. వీటిలోని దాదాపు అన్ని గ్రామాలకు వెళ్లే ప్రధాన గ్రామీణ రోడ్లు పూర్తిగా గుంతలు పడ్డాయి. 15 సంవత్సరాల క్రితం వేసిన బీటీ రోడ్లు పూర్తిగా ధ్వంసమయ్యాయి. దీంతో పాటు రోడ్లు ఎక్కడికక్కడ గుంతలు పడడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు చెందుతున్నారు. రాత్రి సమయంలో గ్రామాలకు వెళ్లాలంటేనే వాహనదారులు జంకుతున్నారు. గుంతల విషయం తెలియని కొత్తగా గ్రామాలకు వస్తున్న అనేకమంది వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారని స్థానికులు పేర్కొంటున్నారు. గ్రామాలకు వెళ్లే రోడ్లు గుంతలమయంగా మారాయని ప్రజాప్రతినిధులకు ఎన్నిసార్లు చెప్పినా పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. వైసిపి ప్రభుత్వం కనీసం రోడ్ల గుంతలు కూడా పూడ్చలేదు. కూటమి ప్రభుత్వం వచ్చి 7 నెలలు పూర్తయింది. ఈ ప్రభుత్వంలోనైనా గ్రామీణ రోడ్ల సమస్యలు పరిష్కరించాలని మండలంలోని వివిధ గ్రామాల ప్రజలు కోరుతున్నారు. గూళ్యం నుంచి జె.హోసల్లి, చింతకుంట నుంచి చాకిబండ, చింతకుంట నుంచి మల్లికార్జున పల్లి, చింతకుంట నుంచి శిరుగాపురం, నిట్రవట్టి నుంచి ఆలూరు, హాలహర్వి నుంచి మోకా, హాలహర్వి నుంచి మాచనూరు రోడ్లు ధ్వంసమయ్యాయి కనీసం మరమ్మతులైనా చేపట్టాలని గ్రామస్తులు, వాహనదారులు కోరుతున్నారు.

గుంతలమయమైన రహదారి

గుంతల రోడ్లు బాగు చేయించాలి

- లేపాక్షి, సిద్ధాపురం గ్రామం

నిత్యం గుంతల రోడ్లతో ఇబ్బందులు పడుతున్నారు. సిద్ధాపురం గ్రామస్తులే కాకుండా గ్రామం మీదుగా బళ్లారి వాహనదారులు సైతం ఇబ్బందులు పడుతున్నారు. ఎన్నికలకు ముందు రోడ్లు వేస్తామని చెప్పినా నేటికీ రోడ్డు బాగు చేయలేదు. వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. వాహనాలు సైతం దెబ్బతింటున్నాయి. హాలహర్వి మండలంలో అన్ని గ్రామాలకు వెళ్లే రోడ్లు పూర్తిగా పాడయ్యాయి. ఉన్నతాధికారులు స్పందించి రోడ్లు బాగు చేయించాలి.

రోడ్లు వేసి కాపాడాలి

- కుబేర, మాచనూరు గ్రామం

నిత్యం నిత్యావసర సరుకుల కోసం మండల కేంద్రమైన హాలహర్వికి వందల మంది వాహనాలపై తిరుగుతూ ఉంటారు. రోడ్డు వేసి వాహనదారులను కాపాడాలి.

చంద్రబాబు కృషితో ఉక్కుకు ఆర్థిక భరోసా

- టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు

ప్రజాశక్తి - ఆదోని

విశాఖ స్టీల్ ప్లాంట్‌ను పునరుజ్జీవింపజేయడానికి ముఖ్యమంత్రి చంద్రబాబు అహర్నిశలు కృషి చేస్తున్నారని, టిడిపి ఇన్‌ఛార్జి, మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు తెలిపారు. మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కేసుల నుంచి నాకు విముక్తి కల్పించండి. కావాలంటే నా ప్రాణాన్ని తాకట్టు పెడతానని గత ముఖ్యమంత్రి జగన్ రెడ్డి ఢిల్లీ వెళ్లేవారని ఎద్దేవా చేశారు. పదిసార్లు ముఖ్యమంత్రి చంద్రబాబు హస్తినాకు వెళ్లి రాష్ట్ర ప్రయోజనాల కోసం పాటుపడుతున్నారని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు హస్తిన పర్యటనకు వెళ్లి వచ్చిన ప్రతిసారి రాష్ట్రానికి కేంద్రం గుడ్ న్యూస్ చెబుతూనే ఉన్నారు. ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోయిన విశాఖ స్టీల్ ప్లాంట్‌ను కాపాడేందుకు రూ.11,440 కోట్ల ఆర్థిక ప్యాకేజీని ఇచ్చేందుకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల క్యాబినెట్ కమిటీ ఆమోదముద్ర వేసిందని తెలిపారు. గత ప్రభుత్వ నిర్లక్ష్యంతో విశాఖ స్టీల్ ప్లాంట్ అప్పుల్లో కూరుకుపోయిందని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే ఉత్తరాంధ్ర అభివృద్ధి, విశాఖ ఉక్కు పరిశ్రమపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఈ సంక్షోభం నుంచి గట్టెక్కాలంటే రూ.18 వేల కోట్లు అవసరమని విశాఖ పర్యటనకు వచ్చిన కేంద్ర ఉక్కు శాఖ మంత్రి కుమారస్వామికి టిడిపి రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ రావు, మంత్రి భరత్ విన్నవించిన కొద్ది రోజులకే ఎమర్జెన్సీ అడ్వాన్స్ ఫండ్ కింద జిఎస్‌టి చెల్లింపులకు రూ.500 కోట్లు, ముడిసరుకుకు సంబంధించి బ్యాంకు అప్పుల చెల్లింపులకు రూ.1,150 కోట్లు మొత్తం రూ.1,650 కోట్లను రెండు విడతల్లో కేంద్రం ఆర్థిక సహాయం అందించిందని వివరించారు.

వలసలు వెళ్లొద్దు.. 'ఉపాధి' కల్పిస్తాం

- ఎపిఒ తిమ్మారెడ్డి

ప్రజాశక్తి - మంత్రాలయం

ఉపాధి పనులు లేవని వలసలు వెళ్లొద్దని, ప్రభుత్వం నుంచి అందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని ఎపిఒ తిమ్మారెడ్డి తెలిపారు. మంగళవారం మండలంలోని మాధవరం, రచ్చుమర్రి, సూగూరు, చిలకలడోన గ్రామాల్లో ఉపాధి కూలీలకు పనులపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ఎక్కువ కూలి కోసం ఇతర ప్రాంతాలకు పిల్లలను, వృద్ధులను వదిలి వలసలు వెళ్లవద్దని, గ్రామంలో కల్పించే ఉపాధి పనులను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఉపాధి చట్టం ద్వారా కల్పించే పని దినాలను అందరూ వినియోగించుకోవాలాలని తెలిపారు. ఉపాధి పనుల పర్యవేక్షణ అధికారులు ఇచ్చిన కొలతల ప్రకారం ఉపాధి పనులు చేసుకుంటే సొంత ఊరిలోనే రోజుకు రూ.300 వేతనం వస్తుందని సూచించారు. ఇతర పట్టణాలకు వెళ్లి చదువులు విడిపించి పిల్లల భవిష్యత్తుకు నష్టం కలిగించవద్దని, పనులు కావాల్సిన వారందరికీ ఉపాధి పనులు కల్పిస్తామని హామీ ఇచ్చారు. ఇసి శ్రీనివాసులు, టిఎలు రేణుక, మరద్వతి, హనుమంతు, ఎఫ్ఎలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఎపిఒ తిమ్మారెడ్డి

రాజగోపురం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - కౌతాళం

శ్రీనరసింహ ఉరుకుంద ఈరన్న స్వామి రాజగోపురం నిర్మాణం కోసం విరాళం ఇచ్చినట్లు సీనియర్ అసిస్టెంట్ విజయ్ కుమార్ తెలిపారు. మంగళవారం అనంతపురం జిల్లా గుంతకల్‌కు చెందిన జె.రంగారావు వారి కుటుంబ సభ్యులు రూ.60 వేల విరాళాన్ని కార్యాలయంలో అందజేశారన్నారు. అధికారులు దాతలకు శ్రీస్వామివారి దర్శనం, స్వామివారి శేష వస్త్రం, లడ్డూ ప్రసాదాలు, ఆశీర్వాదాలు కల్పించి, బాండు పేపర్, పూలమాలతో సన్మానించారు. దేవస్థాన ముఖ్య అర్చకులు రమేష్ స్వామి, అర్చకులు శివపుత్ర స్వామి, దేవస్థాన సిబ్బంది పాల్గొన్నారు.

వలసల నివారణకు చర్యలేవి..?

- 'వలసలు - ఉపాధి'పై 23న ఆదోనిలో సదస్సు
- వ్యకాస జిల్లా అధ్యక్షులు వీరశేఖర్

ప్రజాశక్తి - దేవనకొండ

జిల్లా పశ్చిమ ప్రాంతంలో బతుకుదెరువు కోసం నిత్యం వలసలు వెళ్తున్నా వాటి నివారణకు నిర్దిష్టమైన చర్యలు చేపట్టడం లేదని వ్యకాస జిల్లా అధ్యక్షులు బి.వీరశేఖర్ విమర్శించారు. 'వలసలు-ఉపాధి' అనే అంశంపై ఈనెల 23న ఆదోనిలో సదస్సు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మంగళవారం సదస్సు కరపత్రాలను వ్యకాస, ప్రజా సంఘాల కార్యకర్తలు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీరశేఖర్, వ్యకాస మండల ఉపాధ్యక్షులు యూసుఫ్ బాష, సిఐటియు నాయకులు అశోక్ మాట్లాడారు. జిల్లా పశ్చిమ ప్రాంతంలో వలసలు నిత్యకృత్యమయ్యాయని, వ్యవసాయ సీజన్ నాలుగు నెలలు మాత్రమే వ్యవసాయ పనులు ఉంటాయని తెలిపారు. తర్వాత సుదూర ప్రాంతాలకు పొట్ట చేత పట్టుకొని వలసలు వెళ్లే పరిస్థితి గ్రామీణ ప్రాంతాల్లో నెలకొందని చెప్పారు. ప్రభుత్వం వలసల నివారణకు చర్యలు చేపట్టడంలో విఫలమైందని విమర్శించారు. వలసలు వెళ్లిన చోట ప్రమాదాలకు గురై మరణిస్తున్నారని, తీవ్ర అసౌకర్యాల మధ్య గుడారాలు వేసుకుని జీవనం సాగిస్తున్నారని తెలిపారు. వలస వెళ్లిన కుటుంబాల పిల్లలు చదువుకు దూరమవుతున్నారని, సీజనల్ హాస్టల్ ఏర్పాటులో ప్రభుత్వానికి చిత్తశుద్ధి లేదని విమర్శించారు. వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని, ఉపాధి పని దినాలు పూర్తయిన వారికి అదనంగా మరో వంద రోజులు కల్పించి.. వేతనం, పని ప్రదేశంలో మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. వలసలపై నిర్వహించే సదస్సుకు వ్యకాస రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెంకటేశ్వర్లు, డ్వామా పీడీ, సిబ్బంది, అధికారులు హాజరవుతారని తెలిపారు. నాగేష్, నాగన్న, బండ్లయ్య, నరసయ్య, రామాంజనేయులు పాల్గొన్నారు. **ఆస్పరి** మండలం చిరుమాన్ దొడ్డి గ్రామంలో ఉపాధి పనులను వ్యకాస జిల్లా సహాయ కార్యదర్శి బాలకృష్ణ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ... అధికారులు గ్రామాలకు వెళ్లకపోవడం, సక్రమంగా ఉపాధి పనులు కల్పించక పోవడం వల్ల వలసలను అరికట్ట లేకపోతున్నారని తెలిపారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం వచ్చిన తర్వాత పేదలకు ఉన్న ఉపాధి హామీ చట్టాన్ని నిర్వీర్యం చేస్తున్నారని మండిపడ్డారు. జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు లేకపోవడంతో రైతులు వర్షాధార పంటలపైనే ఆధారపడి జీవిస్తున్నారని పేర్కొన్నారు. జాబ్ కార్డులు లేని వారికి కొత్త జాబ్ కార్డులు ఇవ్వాలన్నారు. రోజువారీ కూలి రూ.600, పని ప్రదేశాల్లో మెడికల్ కిట్లు, టెంట్లు ఏర్పాటు చేయాలని కోరారు. ఈ నెల 23న ఆదోనిలో జరిగే సదస్సులో ఉపాధి కూలీలు పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. రైతుసంఘం మండల కార్యదర్శి రంగస్వామి, ఉపాధి మేటీలు పీరయ్య, రామాంజనేయులు, నాగేంద్ర, నారాయణ, చంద్ర, రంగమ్మ పాల్గొన్నారు. **ఆదోని** మండలంలోని పలు గ్రామాల్లో ఉపాధి పనులు జరుగుతున్న ప్రాంతాలకు వెళ్లి కూలీలకు కరపత్రాలు పంపిణీ చేశారు. సిఐటియు మండల అధ్యక్షులు రామాంజనేయులు పాండవగల్ గ్రామంలో ఉపాధి హామీ పని ప్రదేశంలోకి వెళ్లి కూలీలతో మాట్లాడారు. ఆదోని ప్రాంతంలో చేయడానికి పనుల్లేక కూలీలు సుదూర ప్రాంతాలకు వలసలు వెళ్తున్నారని తెలిపారు. ఈనె 23న ఆదోనిలోని భావసార కల్యాణ మండపంలో సదస్సు నిర్వహిస్తున్నామని చెప్పారు. సిఐటియు మండల నాయకులు పాండురంగ, వ్యకాస మండల నాయకులు గోవిందు, హుస్సేని ఉన్నారు.

దేవనకొండలో కరపత్రాలు విడుదల చేస్తున్న వీరశేఖర్

ఆస్పరిలో ఉపాధి కూలీలతో మాట్లాడుతున్న బాలకృష్ణ

ఆదోనిలో అవగాహన కల్పిస్తున్న నాయకులు

కర్ణాటక మద్యం ప్యాకెట్లు స్వాధీనం

- పుణ్యక్షేత్రంలో మద్యం అమ్మకాలు నిషేధం - ఎస్ఐ పరమేష్ నాయక్

ప్రజాశక్తి - మంత్రాలయం

ప్రముఖ ఆధ్యాత్మిక పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలోని తుంగభద్ర నదీతీరంలో మద్యం అక్రమ వ్యాపారం కొనసాగిస్తున్న వ్యక్తి నుంచి కర్ణాటక మద్యం టెట్రా 120 ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ పరమేష్ నాయక్ తెలిపారు. మంగళవారం సిఐ రామాంజులు ఆదేశాల మేరకు స్థానిక నదీతీరంలో ఉన్న గంగమ్మ గుడి వద్ద ఈడిగ నాగరాజు అక్రమంగా కర్ణాటక మద్యం విక్రయాలు చేస్తున్న విషయంపై వచ్చిన సమాచారం మేరకు తనిఖీ చేశామన్నారు. ఆయన కెఎ 36 ఇవై 0921 నెంబర్ గల ద్విచక్ర వాహనంలో ఉన్న కర్ణాటక రాష్ట్రానికి చెందిన 90 విస్కీ ఒరిజినల్ ఛాయిస్ టెట్రా ప్యాకెట్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు పేర్కొన్నారు. పుణ్యక్షేత్రమైన మంత్రాలయంలో మద్యం అమ్మకాలు, సేవించడం నేరమని, అలాంటి వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భక్తులు, గ్రామస్తులు పుణ్యక్షేత్రం పవిత్రతను కాపాడేందుకు సహకరించాలని కోరారు.

మద్యాన్ని చూపుతున్న పోలీసులు

అక్రమ మద్యంపై ఉక్కుపాదం

- ఎక్సైజ్ సిఐ సైదుల్

ప్రజాశక్తి - ఆదోని

కర్ణాటక మద్యం అక్రమంగా తరలించినా, విక్రయించినా చర్యలు తీసుకుంటామని ఆదోని ఎక్సైజ్ సిఐ ఎస్‌కెజె.సైదుల్ హెచ్చరించారు. స్టేషన్ పరిధిలో కౌతాళం మండలం కుంభలనూరు క్యాంపులో తనిఖీలు చేపట్టి నిల్వ ఉంచిన మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. మంగళవారం స్వాధీనం చేసుకున్న మద్యాన్ని మీడియా ముందు ఉంచారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. సంపాదనే ధ్యేయంగా కొందరు అడ్డదారుల్లో వేరే రాష్ట్రాల మద్యాన్ని తీసుకొచ్చి విక్రయిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. అలాంటి వారి సమాచారాన్ని తమకు అందించాలని కోరారు. కుంభలనూరు క్యాంపు గ్రామానికి చెందిన ముత్యాల ప్రసాద్ వద్ద వివిధ రకాల 7 కేసుల కర్ణాటక బీర్లు, 4 కర్ణాటక టెట్రా ప్యాకెట్ మద్యం బాక్సులను సీజ్ చేసి అతనిపై కేసు నమోదు చేసి అరెస్టు చేశామన్నారు.

డిప్యూటీ సిఎం చిత్రపటం అందజేత

ప్రజాశక్తి - కౌతాళం

కౌతాళం తహశీల్దార్ కార్యాలయానికి జనసేన పార్టీ అధినేత, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని తహశీల్దార్ రజినీకాంత్ రెడ్డికి జనసేన మండల నాయకులు రామాంజనేయులు మంగళవారం అందజేశారు. జనసేన నాయకులు అబ్దుల్ ఖాదర్, రామ్ ప్రసాద్, మహబూబ్, మహేష్ పాల్గొన్నారు.

చిత్రపటం అందజేస్తున్న నాయకులు

'ఫుట్‌బాల్' విజేత ఫలక్‌నుమా

- రన్నర్‌గా నిలిచిన వైఎఫ్ఎ ఎమ్మిగనూరు జట్టు
- బహుమతులను అందజేసిన తహశీల్దార్, టిడిపి నాయకులు, ఆర్గనైజర్లు
- ముగిసిన బీవీ స్మారక ఫుట్‌బాల్ టోర్నమెంట్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఎమ్మిగనూరు శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా గత 7 రోజులుగా ఎమ్మిగనూరు ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డి స్మారక అంతర్ రాష్ట్ర ఫుట్‌బాల్ టోర్నమెంట్ విజేతగా ఫలక్‌నుమా (హైదరాబాద్) జట్టు నిలిచింది. ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజర్ వాల్మీకి రామకృష్ణ నాయుడు ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ఫైనల్‌లో వైఎఫ్ఎ ఎమ్మిగనూరు జట్టు, ఫలక్‌నుమా (హైదరాబాద్) జట్టు తలపడ్డాయి. ఇరు జట్ల మధ్య మ్యాచ్ హోరాహోరీగా సాగింది. ఫలక్‌నుమా విజయం సాధించింది. రన్నర్‌గా వైఎఫ్ఎ ఎమ్మిగనూరు జట్టు నిలిచింది. ఫలక్‌నుమా (హైదరాబాద్) జట్టు 4-2 పెనాల్టీలో ఎమ్మిగనూరు జట్టుపై విజయం సాధించింది. మొదటి బహుమతి రూ.1.50 లక్షలు ఫలక్‌నుమా జట్టుకు దక్కింది. రెండో బహుమతి రూ.లక్ష వైఎఫ్ఎ ఎమ్మిగనూరు జట్టుకు దక్కింది. 3వ బహుమతి రూ.50 వేలు గోల్డెన్ హైదరాబాద్ జట్టుకు దక్కింది. 4వ బహుమతి రూ.25 వేలు చైతన్య ఎఫ్‌సి జట్టుకు దక్కింది. ఇందులో టోర్నమెంట్ బెస్ట్ ప్లేయర్‌గా సమీర్ (హైదరాబాద్), బెస్ట్ టీమ్‌గా ఎమ్మిగనూరు బీ-టీం జట్టు, బెస్ట్ గోల్ కీపర్‌గా రాము (ఎమ్మిగనూరు), టాప్ స్కోరర్‌గా 8 గోల్స్ కొట్టిన హైదరాబాద్ జట్టుకు చెందిన గణపతి నిలిచారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎమ్మిగనూరు తహశీల్దార్ శేషఫణి, విద్యుత్ డిఇ నాగేంద్రప్రసాద్, ప్రధానోపాధ్యాయులు కృష్ణమూర్తి, బాలికల కళాశాల ప్రిన్సిపల్ వనిజరాణి, టిడిపి నాయకులు, కౌన్సిలర్లు రామదాస్ గౌడ్, మహేంద్ర, భాస్కర్, బందేనవాజ్, ఇస్సాక్, అమాన్, నరసింహ దామా, శివకుమార్, సలీం పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. శ్రీనీలకంఠేశ్వర స్వామి జాతర సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ బీవీ.జయనాగేశ్వర రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన వివిధ క్రీడల్లో అంతర్ రాష్ట్ర క్రీడాకారులు పాల్గొనడం సంతోషకరంగా ఉందన్నారు. ప్రతి క్రీడాకారుడూ క్రీడా స్ఫూర్తితో గెలుపోటములను సమానంగా స్వీకరించి ముందుకెళ్లాలని సూచించారు. ఫుట్‌బాల్ సీనియర్ ప్లేయర్, కోచర్ మాబు సాహెబ్, సీనియర్ ఆటగాళ్లు భరత్, అడిషనల్ ఎస్పీ ఈరన్న, హనీఫ్, నరసింహారాజు, శ్రీనివాసులు, ఉప్పర నాగరాజు, నాగేంద్ర కుమార్, మాజీ బిఎస్ఎఫ్ సత్య, బీవీ ఫుట్‌బాల్ టోర్నమెంట్ ఆర్గనైజర్లు వాల్మీకి రామకృష్ణ నాయుడు, కామర్తి మహేష్, నాగూర్ బాష, ఎన్‌బికె ఈరన్న, స్టోర్స్ ఛైర్మన్ గట్టు అల్తాఫ్, మన్సూర్ బాషా, జిలాని బాషా, క్రీడాకారులు పాల్గొన్నారు.

బహుమతి అందుకుంటున్న ఎమ్మిగనూరు జట్టు

మాట్లాడుతున్న స్పెయిన్ బృందం సభ్యులు

ఆర్‌డిటి గృహాలు ప్రారంభం

ప్రజాశక్తి - గోనెగండ్ల

గోనెగండ్ల మండలం నెరుడుప్పల గ్రామంలో పేదల కోసం ఆర్‌డిటి స్వచ్ఛంద సంస్థ 25 నూతన గృహ సముదాయాలను స్పెయిన్ దేశ బృంద సభ్యులు మంగళవారం ప్రారంభించారు. గ్రామానికి విచ్చేసిన 25 మంది స్పెయిన్ దేశస్తులను గ్రామస్తులు ఘనంగా మేళతాళాలతో సాదరంగా ఆహ్వానించారు. అనంతరం వారు నూతన గృహాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా స్పెయిన్ దేశ బృంద సభ్యులు, ఆర్‌డిటి స్పాన్సర్‌షిప్ డైరెక్టర్ షీబా మాట్లాడారు. ప్రతి ఒక్కరూ ఉపాధిని వెతుక్కుని కష్టపడి పని చేయడంతో పాటు ఇతరులకు సహాయం చేసే గుణాన్ని అలవర్చుకోవాలని తెలిపారు. గ్రామంలో ప్రజల ప్రధాన వృత్తి వ్యవసాయమని, సాగు చేసే ప్రధాన పంటలు, జీవన సరళిపై గ్రామస్తులను అడిగి తెలుసుకున్నారు. గ్రామస్తులందరూ పిల్లలను బాగా చదివించాలని కోరారు. గ్రామంలో మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంపొందించడంతోపాటు ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి పర్యావరణాన్ని రక్షించుకుంటూ ఆరోగ్యంగా జీవించాలన్నారు. ఆర్‌డిటి ఎటిఎం సుదర్శన్ రెడ్డి, సిఐ సుబ్బన్న, చిన్న బజారి, షఫీ, రామలింగప్ప, రాఘవేంద్ర రెడ్డి, రామాంజనేయులు పాల్గొన్నారు.

'అమ్మ గోరు ముద్దలు' పుస్తకావిష్కరణ

- 'తెలుగు కీర్తి' పురస్కారం ప్రదానం

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు రూరల్

పెద్దకడబూరు మండలం కంబదహాళ్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గణితోపాధ్యాయులుగా పనిచేస్తున్న ప్రముఖ బాలసాహిత్యవేత్త, బాలబంధు గద్వాల సోమన్న 62వ పుస్తకం 'అమ్మ గోరు ముద్దలు' పుస్తకాన్ని ఆవిష్కరించారు. మంగళవారం విజయవాడలోనికౌత పూర్ణానంద విలాస్‌లో శ్రీశ్రీ కళావేదిక సిఇఒ డాక్టర్ కత్తిమండ ప్రతాప్, కర్నూలు కన్జ్యూమర్ ఫోరమ్ జడ్జి నరహరి నారాయణ రెడ్డి, ప్రముఖ కవులు, కళాకారుల చేతుల మీదుగా పుస్తకాన్ని ఆవిష్కరించారు. అనంతరం జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో అవార్డులు, రివార్డులు అందుకున్న, 6 వసంతాల కాల వ్యవధిలో 63 పుస్తకాలు రచించి, పలు చోట్ల వాటిని ఆవిష్కరించిన గద్వాల సోమన్న కృషిని గుర్తించి 'తెలుగు కీర్తి' పురస్కారాన్ని ప్రదానం చేశారు. పురస్కార గ్రహీత గద్వాల సోమన్నను తోటి ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందించారు. డప్పు కళాకారుడు కేశవయ్య, ఉపాధ్యాయులు నాగేశ్వరరావు, కొప్పుల ప్రసాద్ పాల్గొన్నారు.

పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న అతిథులు

పంటను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలి

- మాల మహానాడు నాయకులు

రాస్తారోకో చేపడుతున్న నాయకులు

ప్రజాశక్తి - కౌతాళం

మండలంలోని కుమ్మాలనూర్ గ్రామానికి చెందిన మాల ఈరన్న పంటను ధ్వంసం చేసిన వారిపై కేసు నమోదు చేయాలని మాల మహానాడు నాయకులు కోరారు. మంగళవారం మాలమహానాడు ఆధ్వర్యంలో రాస్తారోకో చేపట్టారు. ఈ సందర్భంగా మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జైభీమ్ సాయిరామ్, జిల్లా అధ్యక్షులు మహానంది మాట్లాడారు. ఈనెల 17న సర్వే నెంబర్ 128లో ఈరన్న వరి పంట కోత దశలో ఉండగా, అదే గ్రామానికి చెందిన కురువ ముది గౌడు, మహాదేవప్ప, కురువదిన్నె వీరేష్, పకీరప్ప, పంపన్న గౌడులు వరి పంటను కాల్చేశారని తెలిపారు. ఇప్పటివరకు పోలీసులు పట్టించుకోక పోగా నిందితులకు వత్తాసు పలుకుతున్నారని విమర్శించారు. ఈరన్న పొలాన్ని కాల్చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని, లేకపోతే ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. మాల మహానాడు ఆదోని మండల అధ్యక్షులు దాసరి నరేష్ కుమార్, కౌతాళం మండల అధ్యక్షులు రాము శ్రీనివాసులు, ఆస్పరి ఎల్లమ్మ, బంగారమ్మ, పుల్లమ్మ, మాణిక్యమ్మ పాల్గొన్నారు.

టిడిపి ఇన్‌ఛార్జ్ వీరభద్ర గౌడే : టిడిపి

ప్రజాశక్తి- దేవనకొండ

టిడిపి ఆలూరు ఇన్‌ఛార్జ్ వీరభద్ర గౌడే అని, ఇందులో ఎలాంటి అనుమానాలకు తావు లేదని టిడిపి నాయకులు తెలిపారు. కొందరు టిడిపి నాయకులు ఇన్‌ఛార్జ్ ఆయన కాదు.. అధికారిక ప్రకటన చేయాలని చెప్పడం తగదని మండిపడ్డారు. మంగళవారం టిడిపి కార్యాలయంలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా టిడిపి మండల నాయకులు బడిగింజల రంగన్న, ఈదుల దేవరబండ సుభాన్, నీలకంఠం గౌడ్, వెంకటస్వామి గౌడ్, వెలమకూరు సర్పంచి భాస్కర్, మాజీ ఎంపిటిసి ఆకుల వీరేష్ మాట్లాడారు. కీర్తిశేషులు ఎన్‌టి.రామారావు పార్టీ స్థాపించినప్పటి నుంచి ఎమ్మెల్యేగా ఓడినవారే నియోజకవర్గ ఇన్‌ఛార్జ్‌గా బాధ్యతలు తీసుకుంటున్నారని తెలిపారు. గతంలో 2019 ఎన్నికల్లో కోట్ల సుజాతమ్మ ఓడినా ఇన్‌ఛార్జ్‌గా కొనసాగారని గుర్తు చేశారు. 2024లో కూడా వీరభద్ర గౌడ్‌కు టిడిపి అభ్యర్థిగా టికెట్ కేటాయించారని, స్వల్ప మెజార్టీతో ఓటమి చెందారని తెలిపారు. అప్పటినుంచి కొంతమంది ఇన్‌ఛార్జ్ 'నువ్వా.. నేనా' అంటూ నియోజవర్గంలోనే టిడిపి కేడర్‌ను మభ్య పెట్టారని చెప్పారు. కొంతమంది నాయకులు స్వార్థం కోసం కష్టపడిన కార్యకర్తలను అయోమయంలో పెట్టడం సరైంది కాదన్నారు. ప్రస్తుతం ఉన్న టిడిపి కార్యాలయం చిన్నగా ఉండడం వల్ల సమావేశాలు నిర్వహించినప్పుడు సరిపోవడం లేదని తెలిపారు. మరో టిడిపి కార్యాలయం ప్రారంభిస్తున్నామని చెప్పారు. కొందరు టిడిపి నాయకులు రాజకీయ ప్రాబల్యం కోసం ప్రభుత్వ అధికారులను ఇబ్బందులకు గురి చేయడం సరైన విధానం కాదన్నారు. బేతపల్లి సర్పంచి మహేశ్వరరెడ్డి, ఎంపిటిసి తిమ్మప్ప, టిడిపి నాయకులు రాజాసాబ్, మస్తాన్, మజీద్, టివి.రామాంజనేయులు, సతీష్, సుధాకర్ పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

మహారాజశ్రీ జమ్మలమడుగు జూనియర్ సివిల్ జడ్జికోర్టులో

ఓ.ఎస్.నెంబర్ 16/2023

గోపిరెడ్డి వెంకట రామ ప్రసాద్ రెడ్డి, తండ్రి రామిరెడ్డి, వయసు 52 సం.లు, హిందూ, వ్యవసాయం, నివాసం డోర్ నెంబర్ 21/483, శ్రీరామ్ నగర్, 2వ లైను, జమ్మలమడుగు టౌను మరియు మండలం కడప జిల్లా. ...వాది

V/s

గుండ్రెడ్డి రామేశ్వరమ్మ, భర్త నాగేశ్వరరెడ్డి, వయసు 55 సంవత్సరములు, హిందూ, బిజినెస్, నివాసం శిల్పానందవనం, అపార్ట్మెంట్స్, ఫ్లాట్ నెంబర్ 405, ఉలచాల రోడ్డు, కర్నూల్ టౌను మరియు జిల్లా. ...ప్రతివాది

దావా సమను

పైన పేర్కొన్న వాది, ప్రతివాది అయిన మీరు ఇవ్వవలసిన ప్రోనోటు బాపతు బాకీకి సంబంధించి డిగ్రీ కోరుతూ మీ పైన దాఖలు చేసిన దావా మీ హాజరు కొరకు 05.02.2025వ తేదీన వాయిదా ఉన్నది. కావున ఇందుకు మీకు ఏమైనా ఆక్షేపణలు ఉన్న యెడల ఆరోజు ఉదయం 10:30కు రాజశ్రీ కోర్టు వారి ఎదుట హాజరై తెలుపుకునేది లేనంతట విషయము మీ పరోక్షములో తీర్మానించబడును అని తెలియజేయడమైనది.

వాయిదా 05.02.2025

//రాజశ్రీ కోర్టు వారి ఉత్తర్వు మేరకు//

సి సుబ్బారెడ్డి

వాదితరపు న్యాయవాది, జమ్మలమడుగు.